## క్లుప్తంగా

### ఏజీఎంగా పదోన్నతి.. సత్కారం



వెంకటేశ్వర్లుకు సన్మానిస్తున్న నాయకులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు జేకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తూ ఏజీఎంగా పదోన్నతి పొందిన బొల్లం వెంకటేశ్వర్లును ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ నాయకులు ఆదివారం సన్మానించారు. జేకే ఓసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు లింగాల జగన్నాథం, కళ్లం కోటిరెడ్డి, ఆర్.కన్నయ్యల ఆధ్వర్యాన ఆయనను సన్మానించగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. సింగరేణి ఇల్లెందు ఏరియాలో సుదీర్ఘ కాలంగా పనిచేసి సంస్థ అభివృద్ధికి పాటుపడ్డానని తెలిపారు. పోలంపల్లిలో మైన్ తదితర గనుల కాలపరిమితి ముగిసే క్రమాన పొడిగింపునకు కృషి చేశానని చెప్పారు. నాయకులు మేకల శంకర్, మాధవ్, మహబూబ్, అన్వర్, తుపాకుల వెంకటేశ్వర్లు, ఎస్.కే.జానీ, పింగలి నరేష్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, మడుగు సాంబమూర్తి, అక్కిరాజు గణేష్, గూడ బాబూరావు, ఈశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### లైజన్ సెల్ ఏర్పాటు అభినందనీయం



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పనిచేస్తున్న సుమారు 18 వేల మంది ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల కోసం కార్పొరేట్ కార్యాలయంలో లైజన్ సెల్ ఏర్పాటు చేసి, ఒక జీఎంను నియమించడం హర్షణీయమని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాట ఓదేలు అన్నారు. ఈ మేరకు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలోని జీఎం సీపీపీ జక్కం రమేష్‌ను కలిసి మాట్లాడారు. సెల్ ఏర్పాటుకు కృషి చేసిన సీఎండీ ఎన్.బలరామ్, డైరెక్టర్లు, జీఎంలకు ధన్యవాదాలు తెలిపారు. కాగా, తమ ఇతర సమస్యలు కూడా పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోడ రమేష్, చేనెల్ల మురళి, బొజ్జ వెంకటస్వామి, గద్దం వెంకటేష్, బి.నాగయ్య, ఎ.రాజయ్య, దుర్గాప్రసాద్, మధుకృష్ణ, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొత్తగూడెంటౌన్: జిల్లా కేంద్రంలోని పాత కొత్తగూడెంలో ఓ వ్యక్తి ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబీకులు, స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పాత కొత్తగూడేనికి చెందిన మాణిక్యం చలపతి (43) పోస్టాఫీస్ ఏరియాలోని వాటర్ ప్లాంట్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం తన ఇంట్లో ఫ్యాన్ రిపేర్ చేస్తున్నాడు. కుర్చీపై నిలబడి ఫ్యాన్ వైరు నోట్లో పెట్టుకుని, మరమ్మతులు చేస్తూ, ఏమరపాటుగా స్విచ్ ఆన్ చేశాడు. దీంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడేఉన్న చలపతి కూతురు ఆందోళన చెంది కుర్చీని పట్టుకోగా ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. ఈ ఘటనను బయటి నుంచి గమనించిన ఓ వ్యక్తి వచ్చి కుర్చీని కర్రతో గట్టిగా కొట్టాడు. దీంతో చలపతి, అతని కూతురు కిందపడిపోయారు. అపస్మారక స్థితిలో ఉన్న చలపతిని కుటుంబ సభ్యులు, స్థానికులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుమారుడు లోకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్‌ఐ విజయ తెలిపారు.

# భోగభాగ్యాల భోగి..

- వాడవాడలా ఘనంగా వేడుకలు
- ముగ్గులతో రంగులమయంగా వీధులు
- భోగిమంటలతో సర్వత్రా సంబురాలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు

జూలూరుపాడు: మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు భోగి పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తెలుగు ప్రజలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా జరుపుకునే పండుగే సంక్రాంతి కావడంతో మహిళలు, యువతులు తెల్లవారుజామున నిద్రలేచి లోగిళ్లను శుభ్రం చేసి, కల్లాపి చల్లి, రకరకాల ముగ్గులు వేసి రంగులతో తీర్చిదిద్దారు. వాటిపై గొబ్బెమ్మలు, పసుపు, కుంకుమ, నవధాన్యాలు, రేగు పండ్లు, పూలు పెట్టి పూజలు చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. ఇంటింటా పిండివంటల ఘుమఘుమలాడాయి.



టేకులపల్లి: బొమ్మనపల్లిలో భోగి మంట వద్ద కుటుంబీకుల సందడి



సుజాతనగర్ : భోగి మంట వేసిన కుటుంబసభ్యులు

**ఘనంగా గోదాదేవి కల్యాణం**

సుజాతనగర్: స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సాగిన కల్యాణాన్ని తిలకించేందుకు ఆయా గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. గోదా రంగనాథస్వామి వారికి హారతులు సమర్పించారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఇక మండల వ్యాప్తంగా భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ఎదుట అందమైన రంగువల్లులను తీర్చిదిద్దారు. భోగి మంటలు వేయడంతో పాటు చిన్నారుల తలపై భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు.

**ఘనంగా భోగి మంటలు**

పాల్వంచ : పాల్వంచలో శనివారం రాత్రి నుంచే భోగి మంటలు వేసి సందడి చేశారు. పాత మున్సిపాలిటీ కార్యాలయం రోడ్‌లో పలువురు వర్తకులు, స్థానికులు ఆనందోత్సాహాల నడుమ ఈ వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాశ్, సభ్యులు చలవాది ప్రకాశ్, శ్రీకాంత్, రాణి, నిరీశ, శిరీష, రాజ్యలక్ష్మి, సాయి, సాయి లిఖిత్, అప్పమ్మ, సులోచన, రమణ, రాధ, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాల్లో భోగి సందడి..**

టేకులపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం భోగి పండుగ సందడి నెలకొంది. చిన్నా, పెద్ద తేడా లేకుండా భోగి మంటలు వేసుకున్నారు. ఇంటి ముంగిట యువతులు, మహిళలు రంగు రంగుల ముగ్గులతో అలంకరించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

**శ్రీ హరిహర క్షేత్రంలో భోగి వేడుకలు..**

ఇల్లెందు: పట్టణంలోని శ్రీ హరిహర క్షేత్రంలో ఘనంగా భోగి వేడుకలు నిర్వహించారు. అలివేలు మంగా పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో భోగి వేడుకలు..**

ఇల్లెందురూరల్: మండల వ్యాప్తంగా భోగి పండుగను ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే భోగి మంటలు వేసి సంబురాలు చేసుకున్నారు. ఆడ పడుచులు ఇళ్లలోగిళ్లలో అందమైన ముగ్గులు వేసి రంగులతో అలంకరించారు. చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు.



ఇల్లెందు రూరల్ : భోగి మంటల వద్ద చిన్నారులు





ఇల్లెందు రూరల్ : ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న మహిళలు, జూలూరుపాడు : వినోభానగర్‌లో...



ఇల్లెందు : శ్రీ హరిహర క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సుజాతనగర్ : ఓ ఇంట్లో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు



సింగరేణి(కొత్తగూడెం) : చిన్నారికి భోగి పండ్లు పోస్తున్న దృశ్యం

### కాలనీతండాలో ఘనంగా బోనాలు



బోనాలతో వెళ్తున్న మహిళలు

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రంలోని 'ఏ' కాలనీ తండాలో బొడ్రాయి, పోతురాజు, గ్రామ దేవతల విగ్రహాలు ప్రతిష్ఠించి 16 రోజులు పూర్తయిన సందర్భంగా ఆదివారం వేడుకలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామదేవతలకు సమర్పించారు.

### యువతి ఆత్మహత్య

పాల్వంచ: ఇష్టంలేని పెళ్లి సంబంధం చూశారని ఆదివారం ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం బేతం జిల్లా పులివేరుకు చెందిన ముద్దూరు పత్తూ తన కూతురు స్వప్న (25), కుమారుడితో కలిసి పాల్వంచలోని నవ భారత్ గాంధీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. స్వప్నకు ఇటీవల పెళ్లి సంబంధం చూశాడు. ఇష్టంలేని సంబంధం చూడటంతో తండ్రి, సోదరుడు పని నిమిత్తం బయటకు వెళ్లాక ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి సాయంత్రం వచ్చి చూడగా అప్పటికే మృతి చెందింది. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాఘవయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జోడో యాత్రకు మద్దతు తెలపాలి

పాల్వంచ: దేశంలో ఆర్థిక సమస్యలు, సామాజిక అసమానతలు నిర్మూలించి, అందరికీ న్యాయం లభించాలనే సంకల్పంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పాల్వంచ పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు కోరారు. రాహుల్ యాత్రకు మద్దతుగా ఆదివారం పాల్వంచలో ర్యాలీ నిర్వహించారు. తొలుత తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం మార్కెట్ ఏరియా, శాస్త్రిరోడ్, కేఎస్పీ రోడ్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడగా ర్యాలీకి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కేసాబీర్ పాషా సంఘీభావం తెలిపారు. నాయకులు ఎస్ఏ.జలీల్, ఐతా గంగాధర్, లోగాని మురళి, రఘునాయక్, ఓలపల్లి రాంబాబు, కట్టా సోమయ్య, సాంబయ్య, బాబు, భార్గవ్, గౌస్, జావేద్, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, రాహుల్, అబ్దుల్లా, మంజూరు అలీ, శ్రీపాద సత్యనారాయణ, భాస్కర్, రవిగౌడ్, తాళ్లూరి సత్యనారాయణ పాల్గొన్నారు.



పాల్వంచలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న నాయకులు

**యాత్ర విజయవంతం కావాలని పూజలు**

పాల్వంచరూరల్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన యాత్ర వియవంతం కావాలని ఆకాంక్షిస్తూ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో నాయకులు పూజలు చేశారు. డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, సర్పంచ్ అనిత, నాయకులు జాలే జానకీరెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, ఎస్.ఏ.జలీల్, నందనాయక్, బుద్ధకిషోర్, వెంకటేశ్వర్లు, కలగట్ల నాగిరెడ్డి, గంధం సతీష్ పాల్గొన్నారు.



పెద్దమ్మ తల్లి ఆలయంలో పూజలు చేసిన నాయకులు

# రోడ్డు పనుల్లో భద్రత కరువు

హెచ్చరిక బోర్డు లేక ప్రమాదాలు

సుజాతనగర్: సుజాతనగర్ నుంచి వేపలగడ్డ మీదుగా జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భద్రత కరువైంది. సుజాతనగర్ నుంచి చుంచుపల్లి మండలం గోధుమవాగు వరకు చేపట్టిన నాలుగు లేన్ల రహదారి విస్తరణ పనులకు ప్రభుత్వం రూ.45 కోట్లు కేటాయించింది. గుంతలమయంగా ఉన్న బీటీ రోడ్డును మునుపటి కంటే ఎత్తు పెంచి ఆపై మరో లేయర్ వేస్తున్నారు. అయితే, ఓ వైపు పనులు జరుగుతుండగా, రెండో వైపు నుంచి రాకపోకలకు అనుమతిస్తున్నారు. కానీ ఇందుకు అనుగుణంగా బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శనివారం తెల్లవారుజామున ఓ కళాశాలకు చెందిన బస్సు కొత్తగూడెం వైపు వెళ్లడానికి మళ్లిస్తున్న క్రమంలో ఖమ్మం వైపు నుంచి కొత్తగూడెం వెళ్తున్న యాష్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఓపక్క పొగ మంచు, మరోపక్క సంక్రాంతి పండుగ దృష్ట్యా వాహనాల రద్దీ పెరిగిందని తెలిసినా భద్రతాపరమైన చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



హెచ్చరిక బోర్డులకు బదులుగా రోడ్డుకు అడ్డంగా నిలిపిన లారీ



ప్రమాదానికి గురైన కళాశాల బస్సు (ఫైల్)

# అటు ముగ్గులు.. ఇటు క్రీడలు

- పలు ప్రాంతాల్లో పోటీల నిర్వహణ
- ఊరూవాడ సందడి వాతావరణం

ఎక్కడ చూసినా పండుగ సందడి కనిపిస్తోంది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు, చదువు నిమిత్తం ఇతర పట్టణాల్లో ఉన్నవారు సంక్రాంతికి స్వస్థలాలకు చేరారు. దీంతో పార్టీలు, యువజన సంఘాల ఆధ్వర్యాన మహిళలకు ముగ్గులు, యువతకు క్రీడాపోటీలు నిర్వహించగా ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు.

**సంస్కృతి, సంప్రదాయాల మేళవింపు**

సింగరేణి(కొత్తగూడెం): సంస్కృతి, సంప్రదాయాల మేళవింపే సంక్రాంతి పర్వదినమని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. పట్టణంలోని పాత కొత్తగూడెంలో యువజన సమాఖ్య నాయకుడు నిమ్మగడ్డ వికాస్ జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. అంతరించిపోతున్న సంప్రదాయాలను భావితరాలకు అందించేలా పండుగలు దోహదపడతాయన్నారు. ఆ తర్వాత పట్టణంలోని కూలీలైన్, చుంచుపల్లి మండలంలోని గరిమెళ్లపాడు గ్రామాలను ఎమ్మెల్యే సందర్శించగా స్థానికులు సత్కరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కే.సాబీర్‌పాషాతో పాటు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల జమలయ్య, కె.రత్నకుమారి, ఎస్.కే.ఫహీమ్, కిలారు ప్రసాద్, రామారావు, పుట్టి భాగ్యలక్ష్మి, షహీన్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

**సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యాన..**

ఇల్లెందురూరల్: మండలంలోని సీఎస్పీ బస్తీ రాజీవ్‌నగర్ తండాలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యాన మహిళలకు ఆదివారం ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. నాయకులు ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, ధరావత్ రాందాస్, హుస్సేన్, మోహన్‌రావు, భాగ్యలక్ష్మి, సంతోష, కౌసల్య, వీరభద్రం, విజయ, జ్యోతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

**పాల్వంచలో..**

పాల్వంచ: సంక్రాంతి సకల జనుల పండుగ అని ఎస్‌ఐ బాణాల రాము అన్నారు. పట్టణంలోని వనమా కాలనీలో టీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. ట్రస్ట్ సభ్యులు నరాటి ప్రసాద్, తాండ్ర బుచ్చిబాబు, సర్పంచ్ రాజేశ్, ఎండి.యూసఫ్, స్థానికులు కోరే కృష్ణ, బాబురావు, గణేశ్ పాల్గొన్నారు.



సింగరేణి(కొత్తగూడెం) : ఎమ్మెల్యే కూనంనేనిని సన్మానిస్తున్న నాయకులు

**టేకులపల్లి మండలంలో..**

టేకులపల్లి: సంక్రాంతి పండుగ సందర్భంగా టేకులపల్లి మండలంలోని గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్యారమ్స్, డ్రాయింగ్, పాటలు, షటిల్ పోటీలు నిర్వహించగా, బద్దుతండాలో క్రికెట్ టోర్నీని ఎంపీటీసీ ఊకె రామకృష్ణ ప్రారంభించారు.

**ప్రగతి జ్యోతులు వెలగాలి..**

ఇల్లెందురూరల్: ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకొని ఇళ్లలో ప్రగతి జ్యోతులు వెలిగించాలని కొత్తగూడెం మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మోకాళ్ల వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని రాఘబోయినగూడెంలో ప్రభుత్వ ఉద్యోగుల ఆధ్వర్యాన నిర్వహించిన క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో బొర్ర రామయ్య, చీమల సంధ్యారాణి, తాటి అనిత, మోకాళ్ల మానస, వజ్జ అంజమ్మ, భూక్యా శ్రావణి, ఈసం స్వరూప, ఈసం మీనా, అను, చీమల సంధ్యారాణి, జోగ సుజాత తదితరులు పాల్గొన్నారు.

**డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన...**

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం ఉయ్యాలవాడలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు సీఐ పెద్దన్న కుమార్ బహుమతులు అందజేసి మాట్లాడారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సురేష్‌తో పాటు సత్య, ధరావత్ వెంకన్న, విజయ్‌కుమార్, సైదులు, గోగుల ప్రవీణ్, కుంజ రాంబాబు, శెట్టిపల్లి నిర్మల, నునావత్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.




పాల్వంచ : విజేతకు బహుమతి అందిస్తున్న ఎస్‌ఐ రాము




ఇల్లెందు రూరల్ : మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ నబీ



టేకులపల్లి : బద్దుతండాలో క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతి అందజేస్తున్న ఎంపీటీసీ రామకృష్ణ



ఇల్లెందు రూరల్ : మాట్లాడుతున్న మోకాళ్ల వెంకటేశ్వర్లు



కొత్తగూడెం రూరల్ : సీఐ పెద్దన్న కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

# మళ్లీ తెరపైకి అవిశ్వాసం

- నిలిచిన నిధులు.. ఆగిన పనులు
- ఇల్లెందు మున్సిపాలిటీలో అస్తవ్యస్తంగా పాలన


ఇల్లెందు: ఇల్లెందు మున్సిపాలిటీలో అవిశ్వాసం అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. గత ఏడాది ఫిబ్రవరి 6న అప్పటి కలెక్టర్ అనుదీప్‌కు కొందరు కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసు అందజేశారు. అయితే ఆయన ఈ అంశానికి అంతగా ప్రాధాన్యత ఇవ్వలేదు. నాటి ప్రభుత్వ సూచనల ప్రకారం కొత్త మున్సిపల్ చట్టంలో అవిశ్వాసానికి నాలుగేళ్ల పదవీ కాలం ప్రామాణికంగా ఉందంటూ ఆ నోటీసును బుట్టదాఖలు చేశారు. దీంతో కౌన్సిలర్లు కోర్టును ఆశ్రయించారు. నాలుగేళ్లు నిండడం, కోర్టు తీర్పు వెలువడటం, గవర్నర్ సంతకం పెట్టి ఫైల్ ప్రభుత్వానికి పంపించటం, ప్రభుత్వం మారిపోవడంతో ఈ అంశం మళ్లీ తెర మీదకు వచ్చింది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా మూడు మున్సిపాల్టీల్లో అవిశ్వాసం ప్రవేశపెట్టి చైర్మన్, వైస్ చైర్మన్‌లను మార్చిన విషయం విదితమే. ఈ తరుణంలో తాజాగా ఇల్లెందు మున్సిపాలిటీలో 24 వార్డులు ఉండగా 19 మంది కౌన్సిలర్ల సంతకాలతో అవిశ్వాస నోటీస్‌ను కలెక్టర్‌కు అందజేసి, ఆమె ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు. నేడో రేపో కలెక్టర్ నుంచి ఆదేశాలు వెలువడుతాయని భావిస్తున్నారు.



ఇల్లెందు మున్సిపల్ కార్యాలయం

**మున్సిపాలిటీలో బలాబలాలిలా..**

2020 జనవరిలో మున్సిపల్ ఎన్నికలు జరిగినప్పుడు 24 వార్డుల్లో ఆనాటి టీఆర్ఎస్‌కు 19 వార్డులు దక్కాయి. ఎన్డీ, సీపీఐ ఒక్కో స్థానం గెలుచుకోగా, టీఆర్ఎస్ రెబల్స్ మూడు చోట్ల గెలుపొందారు. అయితే కౌంటింగ్ కేంద్రం వద్దే ఇద్దరు సభ్యులు అధికార టీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇలా టీఆర్ఎస్ బలం 21కి చేరింది. ఇక సీపీఐ, ఎన్డీ, టీఆర్ఎస్ రెబల్ ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. ఆ తర్వాత పాలకవర్గంలో అధికార పక్షంలోనే ప్రతిపక్ష కౌన్సిలర్లుగా ఒక వర్గం ఏర్పడింది. క్రమంగా ఆ వర్గం బలం 17కు చేరింది. ఇక రెబల్, సీపీఐ, ఎన్డీ సభ్యులు కూడా అవిశ్వాసం నోటీస్‌పై సంతకాలు చేశారు. కేవలం ఐదుగురు సభ్యులు మాత్రమే సంతకం చేయలేదు. అయితే అవిశ్వాసం సమయాన చేతులు ఎత్తి మద్దతు పలుకుతామని హామీ ఇచ్చినట్లు అవిశ్వాసం కోరుతున్న వర్గం చెబుతోంది. అదే జరిగితే చైర్మన్ డీవీ మినహా అంతా అవిశ్వాసం కోసం ఏకతాటిపైకి వచ్చినట్లు అవుతుంది.



కౌన్సిలర్ల సంతకాలతో కలెక్టర్‌కు అందజేసిన నోటీస్ ఇదే

### 'అధికారం' అడ్డుగా మారేనా..?

ఇల్లెందు మున్సిపాలిటీలో అవిశ్వాసానికి అడ్డుకట్ట వేసేలా అధికార పార్టీకి చెందిన ప్రముఖులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. మున్సిపల్ చైర్మన్ డీవీ అప్పుడే అవిశ్వాసం అనేది ప్రధాన అంశం కావడంతో పార్టీ మారారు. అటు హరిప్రియ, హరిసింగ్, ఇటు కౌన్సిలర్ల వ్యవహార శైలితో విసుగు చెందిన ఆయన కాంగ్రెస్ గూటికి చేరారు. అయితే కాంగ్రెస్‌లో ఉన్న చైర్మన్‌ను పదవీచ్యుత్యున్ని చేసేలా ప్రయత్నించే వారంతా బీఆర్ఎస్‌లో ఉన్నారు. మరి కాంగ్రెస్ పెద్దల వ్యూహం ఫలిస్తుందా.. కౌన్సిలర్లు ఏం నిర్ణయం తీసుకుంటారనేది రెండు, మూడు రోజుల్లో తేలనుందని సమాచారం.

**భారీగా నజరానాల ఎర ?**

అవిశ్వాసం కోసం సమాలోచనలు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే కౌన్సిలర్లు కొంత నజరానా అందుకున్నారు. ఇక మీదట జరిగే అవిశ్వాసానికి సహకరించినందుకు ఒక్కో సభ్యుడికి లక్షల్లో డబ్బు ఎరగా వేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. కేవలం ఒక్క ఏడాది కాలం అధికారం కోసం సుమారు రూ.5 కోట్లు ఖర్చు చేసేందుకు చైర్మన్ పదవి ఆశిస్తున్న ఓ నేత సిద్ధంగా ఉన్నారు.